క్లుప్తంగా

వాహనాల తనిఖీ



బాన్సువాడ: బీర్కూర్ మండల కేంద్రంలో మంగళవారం ఎస్సై రాజశేఖర్ వాహనాలను తనిఖీ చేశారు. మద్యం సేవించి వాహనాలను నడుపుతున్న ఇద్దరిపై కేసులు నమోదు చేశారు. కాంటాక్ట్ నాన్ కాంటాక్ట్ కింద 50 మంది వాహనదారులకు జరిమానాలు విధించారు. మద్యం సేవించి వాహనాలు నడపవద్దని సూచించారు. మైనర్లకు బైక్‌లు ఇవ్వవద్దని అన్నారు.

ఉద్యమ కరపత్రాల ఆవిష్కరణ



బాన్సువాడ: సమస్యల పరిష్కారం కోసం తపస్ ఆధ్వర్యంలో తలపెట్టే ఉద్యమ కరపత్రాలను మంగళవారం పట్టణంలోని కోనా బాన్సువాడ ఉన్నత పాఠశాలలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తపస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రవీంద్రనాథ్ ఆర్య మాట్లాడారు. పెండింగ్ డీఏలు చెల్లించాలని, పీఆర్సీ అమలు తదితర డిమాండ్లతో తపస్ ఉద్యమం చేపడుతుందని అన్నారు. రాష్ట్ర శాఖ పిలుపు మేరకు ఈ నెల 22న అన్ని పాఠశాలల్లో నల్లబ్యాడ్జీలతో నిరసన, 28న తహసీల్దార్లకు వినతి పత్రాలు అందించడం, వచ్చే నెల 5న జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా, నవంబర్ 23న ధర్మాగ్రహ దీక్ష పేరుతో హైదరాబాద్ ఇందిరా పార్కు వద్ద దీక్ష కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. తపస్ జిల్లా ప్రధాన కార్యదర్శి భూనేకర్ సంతోష్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు విజయ్‌కుమార్ ఉన్నారు.

ఫోన్ల అప్పగింత

బిచ్కుంద(జుక్కల్): ఫోన్‌ను పోగొట్టుకున్న ముగ్గురు వ్యక్తులకు సోమవారం ఎస్సై మోహన్‌రెడ్డి ఫోన్లు అప్పగించారు. బాధితులు గతంలో బిచ్కుంద పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు విచారణ జరిపి ఫోన్లను ట్రేస్ చేసి స్వాధీనం చేసుకున్నారు. బిచ్కుందకు చెందిన సంతోష్, హజ్గుల్ చెందిన మహేష్, పెద్ద తక్కడ్‌పల్లికి రాజుకు ఫోన్లు అప్పగించారు.

విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీయాలి



కామారెడ్డి రూరల్: విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీయాలని ఎంఈవో ఎల్లయ్య సూచించారు. సోమవారం కామారెడ్డి పట్టణంలోని రాజానగర్‌కాలనీలో గల ఎంపీపీఎస్ పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల, ఉపాధ్యాయుల హాజరు పట్టికను పరిశీలించారు. విద్యార్థులకు చదవడం, రాయడం నేర్పించాలని ఆదేశించారు. సీఆర్‌పీ చిరంజీవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కోతుల పట్టివేత



మాచారెడ్డి: మండల కేంద్రంలో సోమవారం విచ్చలవిడిగా తిరుగుతున్న కోతులను బంధించారు. కోతుల బెడద ఉన్న మాచారెడ్డి, మాచారెడ్డి చౌరస్తా, చుక్కాపూర్, గన్‌పూర్(ఎం) గ్రామాల ప్రజలు ఇటీవల సమావేశమయ్యారు. ఈమేరకు తిరుపతి నుంచి వచ్చిన కోతులను పట్టే వ్యక్తులు మాచారెడ్డి మండల కేంద్రంలో ఒకే రోజు 80 కోతులను పట్టి బంధించారు. ఒక్కో కోతికి రూ.350 చొప్పున మాట్లాడుకుని పట్టిస్తున్నట్టు గ్రామస్తులు తెలిపారు. బంధించిన కోతులను శ్రీశైలం అడవుల్లో వదిలివేయాలని ఒప్పందం కుదుర్చుకున్నట్టు పేర్కొన్నారు.

కష్టపడిన వారికి గుర్తింపు



తాడ్వాయి(ఎల్లారెడ్డి): కాంగ్రెస్ పార్టీలో కష్టపడ్డ వారికి తప్పనిసరిగా మంచి గుర్తింపు లభిస్తుందని పార్టీ మండల అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి అన్నారు. తాడ్వాయి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సోమవారం కాంగ్రెస్ పార్టీలో పదవులు పొందిన వారిని నాయకులు సన్మానించారు. మండల ఉపాధ్యక్షులుగా లక్ష్మణచారి, రాజీవ్ కుమార్, గైని శివాజీ, మహిళా విభాగం మండల అధ్యక్షురాలిగా బాలంబాయి, ఉపాధ్యక్షురాలిగా మమత, బీసీసెల్ మండల అధ్యక్షుడిగా బాలయ్య, ఎస్టీ సెల్ అధ్యక్షుడిగా కాట్రోత్ రవి, ఎస్సీసెల్ మండల ఉపాధ్యక్షుడిగా వెంకటేష్ నూతనంగా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రాజిరెడ్డి, నాయకులు నరేందర్‌రెడ్డి, షౌకత్‌అలీ, అఖిల్‌రావు, వెంకట్‌రాంరెడ్డి, శ్యాంరావు, సంజీవులు, తదితరులు పాల్గొన్నారు.



బిచ్కుందలో ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు



ఎల్లారెడ్డిలో..

పోలీసుల త్యాగాలు మరువలేనివి

సాక్షి నెట్‌వర్క్:జిల్లాలో సోమవారం పోలీసు అమర వీరుల వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. విధి నిర్వహణలో ప్రాణాలు విడిచిన పోలీసు అమరవీరులకు స్థానిక పోలీస్‌స్టేషన్‌లలో సిబ్బందితో కలిసి ఉన్నతాధికారులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులు మాట్లాడుతూ.. తీవ్రవాదులు, అసాంఘిక శక్తుల నుంచి ప్రజలను, ప్రభుత్వాలను కాపాడేందుకు చాలా మంది పోలీసులు ప్రాణాలర్పించారని గుర్తు చేశారు. ప్రతి పౌరుడు బాధ్యతగా మెలగాలని, యూనిఫాం లేని పోలీసు మాదిరిగా ప్రవర్తించాలని సూచించారు.



మద్నూర్ పోలీస్‌స్టేషన్‌లో నివాళులర్పిస్తున్న పోలీసులు



గాంధారిలో ..

అనంతరం పోలీసు అమరవీరుల ఆత్మకు శాంతి చేకూరాలని రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. పలు పాఠశాల, కళాశాలల్లో వ్యాసరచన పోటీలు నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు.



లింగంపేటలో..



పెద్దకొడప్‌గల్‌లో ..



నాగిరెడ్డిపేట: సిద్ధార్థ కళాశాలలో విద్యార్థినికి బహుమతిని అందజేస్తున్న ఎస్సై మల్లారెడ్డి

విగ్రహాలు ధ్వంసం చేసిన వారిని ఉరితీయాలి



భిక్కనూరులో రాస్తారోకో నిర్వహిస్తున్న హిందూ సంఘాల ప్రతినిధులు



పెద్దకొడప్‌గల్‌లో ఆందోళన చేస్తున్న హిందూ సంఘాల సభ్యులు

భిక్కనూరు: దేవాలయాల్లో విగ్రహాలను ధ్వంసం చేసిన వారిని బహిరంగంగా ఉరి తీయాలంటూ భిక్కనూరు మండల కేంద్రంలో హిందు సంఘాల ఆధ్వర్యంలో సోమవారం రాస్తారోకో నిర్వహించారు. స్థానిక చౌరస్తా వద్ద పాత జాతీయ రహదారిపై అరగంట పాటు ఆందోళన చేశారు. నిందితులను శిక్షించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని నినదించారు. హైదారాబాద్‌లోని కుర్మగూడలో విగ్రహాల ధ్వంసాన్ని నిరసించిన ప్రజలపై పోలీసులు లాఠీచార్జి చేయడం అమానుషమని అన్నారు. హిందు సంఘాల ప్రతినిధులు సంజయ్, గొల్ల రమేష్, నర్సింలు, బాబు, అరుణ్, సిద్ధరాములు, నరేష్, మల్లేష్, సత్యం, తదితరులు పాల్గొన్నారు.

పెద్దకొడప్‌గల్(జుక్కల్): విగ్రహాలపై దాడులకు నిరసనగా మండల కేంద్రంలో హిందూ సంఘాల ఆధ్వర్యంలో సోమవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. హిందూ సంఘాల సభ్యులు, బజరంగదళ్ కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులను సక్రమంగా కళాశాలకు పంపించాలి



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ జ్యోతిర్మయి రాధాదేవి

భిక్కనూరు: విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలకు పంపించే బాధ్యత తల్లిదండ్రులదేనని భిక్కనూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ జ్యోతిర్మయి రాధాదేవి అన్నారు. సోమవారం జూనియర్ కళాశాలలో నిర్వహించిన తల్లిదండ్రుల సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు కొందరు కళాశాలకు సరిగా రావడం లేదని, ఈ విషయమై ప్రశ్నిస్తే తాము వ్యవసాయ పనులకు వెళ్తున్నామని చెబుతున్నారని అన్నారు. సెలవు రోజుల్లో వారిని వ్యవసాయ పనులకు తీసుకెళ్లాలని సూచించారు. విద్యార్థుల తల్లిదండ్రులు 15 రోజులకు ఒక్కసారి కళాశాలకు వచ్చి వారి పురోగతి గురించి తప్పనిసరిగా తెలుసుకోవాలని సూచించారు.

సదాశివనగర్‌లో..

సదాశివనగర్: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం కలెక్టర్ ఆదేశాల మేరకు విద్యార్థుల తల్లిదండ్రులతో అధ్యాపకుల సమావేశం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ ఎండీ అజ్మల్ ఖాన్ మాట్లాడుతూ.. విద్యార్థులకు ఎదురవుతున్న ఇబ్బందుల గురించి, గైర్హాజరవుతున్న విద్యార్థుల గురించి చర్చించామన్నారు. విద్యార్థుల పరీక్ష ఫలితాలు, సాధించిన విజయాల గురించి విద్యార్థుల తల్లిదండ్రులకు తెలిపారు. అధ్యాపకులు ప్రకాష్ మల్లయ్య, లక్ష్మి, చంద్రశేఖర్, రాజేందర్, చందు, హసీనా తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తం

ఎమ్మెల్యే పోచారం పరామర్శ

బాన్సువాడ రూరల్: బాన్సువాడ మాజీ ఎంపీపీ మహ్మద్ ఎజాస్ సోదరి అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలిసి ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి సోమవారం ఇస్లాంపూరలోని వారి నివాసానికి వెళ్లి పరామర్శించారు. భౌతిక కాయానికి నివాళి అర్పించి, కుటుంబ సభ్యులను ఓదార్చారు.

వరి కొనుగోలు కేంద్రం ప్రారంభం

బిచ్కుంద(జుక్కల్): మండలంలోని వాజిద్‌నగర్, శెట్లూర్, ఖద్‌గాంలో సోమవారం వరి కొనుగోలు కేంద్రాలు ప్రారంభమయ్యాయి. ఐకేపీ ఆధ్వర్యంలో వరి కొనుగోలు చేస్తున్నట్లు ఏపీఎం నాగరాజ్ తెలిపారు.

సోమర్యాగడితండాలో..

ఎల్లారెడ్డిరూరల్: సోమర్యాగడి తండాలో కొనుగోలు కేంద్రాన్ని సొసైటీ చైర్మన్ నర్సింలు సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ ప్రశాంత్‌గౌడ్, కార్యదర్శి విశ్వనాథం, డైరెక్టర్లు తదితరులున్నారు.

రైతు భరోసా అందించాలి

నస్రుల్లాబాద్(బాన్సువాడ): వర్షాకాలం రైతు భరోసా డబ్బులు వెంటనే రైతులకు అందించాలని బీఆర్‌ఎస్ నాయకులు సోమవారం నస్రుల్లాబాద్ మండల కేంద్రంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బాన్సువాడ మున్సిపల్ వైస్ చైర్మన్ జుబేర్ మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో రైతుల ఖాతాల్లో పంట ప్రారంభంలోనే వేసేవారని, ఇప్పుడు పంట చేతికి వచ్చినా డబ్బులు జమచేయకపోవడం సిగ్గుచేటన్నారు. నాయకులు నర్సింలు గౌడ్, సాయిలు, సుంచు శేఖర్, అల్లం చిన్న పాల్గొన్నారు.

జుక్కల్ మండల కేంద్రంలో..

నిజాంసాగర్(జుక్కల్): వానాకాలం పంట సాగు చేసిన రైతులకు రైతు భరోసా చెల్లించాలని డిమాండ్ చేస్తూ సోమవారం జుక్కల్ మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ నాయకులు నిరసన చేపట్టారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు నీలుపటేల్, గంగాధర్, భానుగౌడ్ తదితరులు ఉన్నారు.

బీఆర్‌ఎస్ నిరసనను ఖండించిన కాంగ్రెస్ నేతలు

రామారెడ్డి: బీఆర్‌ఎస్ పార్టీ ఆదివారం నిర్వహించిన నిరసన కార్యక్రమాల్ని కాంగ్రెస్ నాయకులు తీవ్రంగా ఖండించారు. అధికారంలో ఉన్నప్పుడు బీఆర్‌ఎస్ పార్టీ చేసిన నిర్వాహకాలను ప్రజలు గ్రహించే బీఆర్‌ఎస్‌ను గద్దె దించారని విమర్శించారు. మాజీ జెడ్పీటీసీ మోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. రైతు సమన్వయ సమితి పేరుతో కమిటీలు వేసినప్పుడు కాంగ్రెస్ కార్యకర్తలకు ఆ కమిటీలలో అవకాశం కల్పించారా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు లక్ష్మాగౌడ్, మాజీ జెడ్పీటీసీ మోహన్‌రెడ్డి, కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు మహేందర్‌రెడ్డిపాల్గొన్నారు.

యూనియన్‌లో బీడీ టేకేదార్ల చేరిక

దోమకొండ: మండల కేంద్రంలో ఉన్న టేలిఫోన్‌బీడీ సెంటర్‌లో బీఎల్‌టీయూ రాష్ట్ర నాయకులు నాగారపు ఎల్లయ్య ఆధ్వర్యంలో బీడీ టేకేదార్ యూనియన్ నుంచి బీఎల్‌టీయూ టేకేదార్ యూనియన్‌లో బీడీ టేకేదార్లు చేరినట్లు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిద్దిరాములు తెలిపారు. రాష్ట్ర నాయకులు ఆంజనేయులు సమక్షంలో 15 మంది చేరినట్లు వెల్లడించారు.

ఎంబీబీఎస్‌లో సీటు .. యువతికి సన్మానం

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): గోపాల్‌పేటకు చెందిన బేస్త సంగయ్య, నవనీతల కుమార్తె కావేరి ఎంబీబీఎస్‌లో సీటు సాధించడంతో ఆమెను సోమవారం మండల కాంగ్రెస్ నాయకులు ఘనంగా సత్కరించారు. మండల కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో కావేరిని శాలువాతో కప్పి సత్కరించారు. పార్టీ తరపున ఆమెకు రూ.10వేల నగదు అందజేశారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు శ్రీధర్‌గౌడ్, నాయకులు రాంచందర్‌రెడ్డి, ఇమామ్, శ్రీరాంగౌడ్, సుధాకర్, ఫారూక్, సురేందర్‌గౌడ్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాల హెచ్‌ఎంకు ప్రశంసలు



భిక్కనూరు: ఢిల్లీలో మూడు రోజులు జరిగిన సెమినార్‌లో తెలంగాణ రాష్ట్రం తరుపున పాల్గొన్న భిక్కనూరు ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల హెచ్‌ఎం శ్రీనాథ్‌ను ఎన్‌సీఈఆర్‌టీ అధికారులు అభినందించారు. సెమినార్‌లో ఆయన రాష్ట్రం తరపున విద్యాభివృద్ధికి సూచించిన అంశాలు పలువురి మన్ననలు పొందాయి. దీంతో ఎన్‌సీఈఆర్‌టీ అధికారులు ఆయనను ప్రశంసించి అభినందించారు. ఈ సందర్భంగా భిక్కనూరు ప్రభుత్వ బాలురు ఉన్నత పాఠశాలలో శ్రీనాథ్‌ను సోమవారం ఉపాధ్యాయులు, విద్యార్థులు సన్మానించారు.

ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలి



ఎల్లారెడ్డి: ఉపాధ్యాయులు విద్యార్థులకు సక్రమంగా బోధించాలని ఎంఈవో వెంకటేశం అన్నారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో నూతనంగా విధుల్లో చేరిన ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు సమయ పాలన పాటించడంతో, విద్యార్థుల భవిష్యత్‌కు బాటలు వేయాలని అన్నారు.

ఆయుధాల వినియోగంపై అవగాహన



ఎల్లారెడ్డిరూరల్: ఎల్లారెడ్డి పోలీస్ స్టేషన్‌లో విద్యార్థులకు ఆయుధాల వినియోగంపై సోమవారం సీఐ, ఎస్సైలు అవగాహన కల్పించారు. ఓపెన్ హౌజ్ కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని పలు పాఠశాలల విద్యార్థులకు పోలీసులు నిర్వహించే విధుల గురించి వివరించారు.

బీజేపీ సభ్యత్వ నమోదు

భిక్కనూరు: మండలంలో బీజేపీ సభ్యత్వ నమోదుకు విశేష స్పందన లభిస్తోందని ఆ పార్టీ మండలాధ్యక్షుడు ఉప్పరి రమేష్ అన్నారు. సోమవారం భిక్కనూరు మండల కేంద్రంలో ఇంటింటా తిరుగుతూ బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ.. పార్టీ సిద్ధాంతాలను ఆశయాలను ప్రజలకు వివరించి సభ్యత్వ నమోదును నిర్వహిస్తున్నామన్నారు. నేతలు అరిగే నర్సింలు, బోయిన హరీష్, రాంచంద్రం, ఆనంద్, నరేష్ పాల్గొన్నారు.

చాముండేశ్వరి దేవి ఆలయ వార్షికోత్సవం



దోమకొండ: మండల కేంద్రంలోని చాముండేశ్వరి ఆలయ 53వ వార్షికోత్సవాలు సోమవారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారి అభిషేకానికి గ్రామానికి చెందిన మహిళలు స్థానిక కుడి చెరువు నుంచి బిందెలతో వాయిద్యాల మధ్య నీటిని తీసుకువచ్చారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించగా మహిళలు పెద్ద సంఖ్యలో పూజల్లో పాల్గొన్నారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు సిద్దారెడ్డి, ప్రతినిధులు ఎల్లం, బాల్‌రాజ్, రమేశ్, మాజీ జెడ్పీటీసీ తీగల తిర్మల్‌గౌడ్, మాజీ సర్పంచ్ నల్లవు శ్రీనివాస్, ఆలయ ప్రధాన అర్చకులు పాల్గొన్నారు.

గ్రామస్థాయిలో పార్టీని బలోపేతం చేయాలి



ఎల్లారెడ్డిరూరల్: గ్రామస్థాయిలో పార్టీని బలోపేతం చేయాలని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కుర్మ సాయిబాబా అన్నారు. సోమవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మండలంలోని 31 గ్రామాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులతో సమావేశం నిర్వహించారు. ప్రతి గ్రామంలో కాంగ్రెస్ పథకాల గురించి ప్రజలకు అవగాహన కల్పించి పార్టీని బలోపేతం చేయాలన్నారు.

నేడు గాంధారి, బాన్సువాడ బంద్

బాన్సువాడ/గాంధారి(ఎల్లారెడ్డి): హిందూ దేవాలయాలపై జరుగుతున్న దాడులకు నిరసనగా మంగళవారం బాన్సువాడ, గాంధారి బంద్‌కు పిలుపునిచ్చినట్లు హిందూ సంఘాల నేతలు తెలిపారు. బంద్‌కు అందరూ సహకరించి వ్యాపార సముదాయాలు, హోటళ్లు స్వచ్ఛందంగా మూసి ఉంచాలని కోరారు. దాడులకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. బంద్‌లో హిందువులందరూ పాల్గొనాలని కోరారు.

యువత భక్తి మార్గంలో నడవాలి

జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు



భక్తులనుద్దేశించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే

నిజాంసాగర్(జుక్కల్): దైవ భక్తి మార్గంలో యువత ముందుండాలని, దైవ అనుగ్రహంతో కార్యాలు సిద్ధిస్తాయని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు పేర్కొన్నారు. సోమవారం మహారాష్ట్రలోని దెగ్లూర్ పట్టణంలో కాశీ విశ్వనాథ మఠం అధిపతి సోమాయప్ప ఆధ్వర్యంలో పంచముఖేశ్వర శివలింగ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమానికి జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కాశీవిశ్వనాథ మఠానికి దేశ వ్యాప్తంగా గుర్తింపు ఉందన్నారు.



కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

సోయా కొనుగోలు కేంద్రం తనిఖీ

మద్నూర్(జుక్కల్): సోయా పంట విక్రయించడానికి వచ్చిన రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు సూచించారు. మండల కేంద్రంలోని మార్కెట్ కమిటీ యార్డులో కొనసాగుతున్న సోయా పంట ప్రభుత్వ కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ఎమ్మెల్యే తనిఖీ చేశారు. రైతులతో ఎమ్మెల్యే మాట్లాడారు. రైతులు ప్రభుత్వ కేంద్రాల్లో సోయా పంటను విక్రయించాలని, దళారులకు అమ్మి నష్టపోవద్దని సూచించారు.

సైబర్ నేరాలతో అప్రమత్తంగా ఉండాలి

లింగంపేట(ఎల్లారెడ్డి): సైబర్ నేరాలతో అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు. మండల కేంద్రంలోని బస్టాండులో సోమవారం లింగంపేట పోలీసులు సైబర్ నేరాలపై ప్రయాణికులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పోలీసు సిబ్బంది మాట్లాడుతూ..సైబర్ నేరగాళ్లు పట్టణాలతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలను మోసం చేస్తూ డబ్బులు కాజేస్తున్నారన్నారు. లాటరీలు, బ్యాంకు ఖాతాలు అప్‌డేట్ చేసుకోవాలని బ్యాంకు అధికారుల పేరిట ఫోన్ చేసి బ్యాంకులో ఉన్న ఖాతా నుంచి డబ్బులు కాజేస్తారన్నారు. పిల్లల తల్లిదండ్రులకు ఫోన్ చేసి మీ అబ్బాయి గంజాయి విక్రయిస్తూ పట్టుబడ్డాడని అతడిని విడిపించడానికి డబ్బులు పంపాలని డిమాండ్ చేస్తారని అన్నారు. అపరిచిత వ్యక్తులు ఫోన్ చేస్తే ఎలాంటి సమాచారం ఇవ్వవద్దన్నారు. సిబ్బంది రాజయ్య, కిరణ్, భైరవ ప్రసాద్, శంకర్, తదితరులున్నారు.



లింగంపేటలో అవగాహన కల్పిస్తున్న పోలీసులు

భూంపల్లి ఉన్నత పాఠశాలలో..

సదాశివనగర్: భూంపల్లి ఉన్నత పాఠశాలలో మాదక ద్రవ్యాలు వాటి నియంత్రణ, సైబర్ క్రైం, విద్యార్థులలో మానసిక ఒత్తిడి మొదలగు అంశాలపై సదాశివనగర్ ఎస్సై రంజిత్ కుమార్ విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. హెచ్‌ఎం లోకేశ్వర్, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ స్వప్న, ఉపాధ్యాయులు శ్రీనివాస్ లింగం, ముతేన్న, లక్ష్మీనారాయణ, మాలతి, హైమావతి, తల్లిదండ్రులు పాల్గొన్నారు .

ప్రత్యేకంగా రిజర్వేషన్లు కల్పించాలి

బాన్సువాడ: ప్రత్యేక రిజర్వేషన్లు కల్పించాలని కోరుతూ మంగళవారం బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయికి బేడ బుడగ జంగం కులస్తులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా దళిత సంఘం నాయకులు అయ్యాల సంతోష్ మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ కోసం ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధ్యక్షతన సబ్ కమిటీ వేసినందున బేడ బుడగ జంగం కులస్తులకు 8 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కులస్తులకు కేటాయించిన రిజర్వేషన్లు ఎవరికీ కేటాయించవద్దని అన్నారు. బేడా బుడగ జంగం జిల్లా ఉపాధ్యక్షుడు అంబయ్య, నాయకులు బాజలాలు, దుర్గాప్రసాద్, దేవదాసు, కాశయ్య, రాములు, సాయిబాబా, సిద్దప్ప ఉన్నారు.

కల్తీకల్లు విక్రయంపై చర్యలు తీసుకోండి



దోమకొండలో తహసీల్దార్ సంజయ్‌రావ్‌కు వినతిపత్రం అందజేస్తున్న స్థానికులు

దోమకొండ: ముత్యంపేటలోని ఎల్లమ్మ ఆలయం వద్ద కల్తీ కల్లును విక్రయిస్తున్నారని, ఈ విషయంలో చర్యలు తీసుకోవాలని దోమకొండ మండల కేంద్రానికి చెందిన పలువురు సోమవారం తహసీల్దార్ సంజయ్‌రావ్‌తో పాటు ఎక్సైజ్ అధికారులకు ఫిర్యాదు చేశారు. కల్లులో ప్రమాదకరమైన మత్తు పదార్థాలు కలుపుతున్నారని, దీంతో తాగిన వారు తీవ్ర అనారోగ్యానికి గురవుతున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. కల్లు దుకాణ నిర్వాహకులపై వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు.



కల్లును పరిశీలిస్తున్న అధికారులు

కల్లు నమూనాల సేకరణ

ముత్యంపేటలో కల్లు దుకాణాలపై సోమవారం ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించారు. కల్తీ కల్లును అమ్ముతున్నారని, కల్లులో మత్తు పదార్థాలు కలుపుతున్నారని ఫిర్యాదులు రాగా వెంటనే స్పందించి దాడులు చేసినట్లు ఎక్సైజ్ అధికారులు తెలిపారు. కల్లు నమూనాలను సేకరించి ల్యాబ్‌కు పంపినట్లు వివరించారు. ఎక్సైజ్ ఎస్సై సుదర్శన్, సిబ్బంది బాల్‌రాజ్, స్వాతి, జమీందార్ పాండవులు ఉన్నారు.

ఎల్‌ఐసీ ఏజెంట్లకు తీవ్ర అన్యాయం



కామారెడ్డి అర్బన్: ఎల్‌ఐసీ ఏజెంట్లకు పాలసీలపై కమీషన్ తగ్గిస్తూ యాజమాన్యం తీసుకున్న నిర్ణయం వల్ల తీవ్ర అన్యాయం జరుగుతోందని భారతీయ జీవిత బీమా ఏజెంట్ల సమాఖ్య(లియాఫీ) నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. లియాఫీ జాతీయ స్థాయిలో శాంతియుత సహాయ నిరాకరణ పిలుపులో భాగంగా సోమవారం మధ్యాహ్నం భోజన విరామ సమయంలో కామారెడ్డి ఎల్‌ఐసీ శాఖ ఎదుట నిరసన తెలిపారు. కమీషన్ల రేట్లను పెంచాల్సింది పోయి తగ్గించడం వల్ల తమ పరిస్థితి అగమ్యగోచరంగా తయారైందని వాపోయారు. లియాఫీ బ్రాంచి అధ్యక్షుడు కదం నారాయణరావు, కార్యదర్శి ప్రదీప్‌కుమార్ జైన్, క్లియా అధ్యక్షుడు వి.రాజిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

లగ్గం సినిమా ప్రివ్యూ షో



కామారెడ్డి టౌన్: సాయి రోనక్, ప్రగ్యా నాగ్రా హీరో హీరోయిన్లుగా నటించిన లగ్గం సినిమా ప్రివ్యూ షోను సోమవారం జిల్లా కేంద్రంలోని దర్శన్ థియేటర్‌లో ప్రదర్శించారు. బీబీపేట మండలం జనగామకు చెందిన వేణుగోపాల్ రెడ్డి ఈ చిత్రానికి నిర్మాతగా వ్యవహరించారు. ఈ సినిమా షూటింగ్ 80 శాతం జనగామ, చింతమడక ప్రాంతాల్లోనే జరిగిందని తెలిపారు. తన ప్రాంతానికి చెందిన ప్రజలకు ముందుగా సినిమా చూపించాలనే ఉద్దేశంతో ప్రివ్యూ షో వేశామని వేణుగోపాల్ రెడ్డి పేర్కొన్నారు. ఈ నెల 25న సినిమా విడుదలవుతుందన్నారు.